క్లుప్తంగా

వెల్ఫేర్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి



సీతానగరం సచివాలయం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్ కుమార్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం-2 సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కోన పవన్ కుమార్ (30) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. కోరుకొండ మండలం జంబూపట్నంకు చెందిన పవన్‌కుమార్ తండ్రి ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగిగా పనిచేస్తూ చనిపోవడంతో పవన్ కుమార్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. ఆదివారం రిపబ్లిక్ డే సందర్భంగా తన గ్రామం వెళ్లకుండా, అమ్మమ్మ గ్రామం అయిన సీతానగరంలో ఉండిపోయారు. తెల్లవారుజామున 4 గంటలకు కడుపునొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకుని అపస్మారక స్థితికి వెళ్లి ప్రాణం విడిచాడని సచివాలయ సిబ్బంది తెలిపారు. మృతుడు పవన్ కుమార్‌కు తల్లి, తమ్ముడు ఉన్నారు.

వరకట్నం కేసు నమోదు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన తంగిరాల వెంకటసాయి శ్రీఅహల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త రామకృష్ణ పవన్, అత్త,మామలపై వరకట్నం కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 2022లో అహల్యకు హైదరాబాద్‌లోని నాగోలుకు చెందిన తంగిరాల రామకృష్ణ పవన్‌తో వివాహం అయింది. హైకోర్టులో జాబ్ చేస్తున్నానని, లాయర్ వద్ద జూనియర్‌గా పనిచేస్తున్నానని భార్యను మోసం చేస్తున్నాడని, స్టీల్ వాటర్ బాటిల్‌తో కొట్టడంతో అహల్యకు ఎడమ చెవి వినికిడి లోపం వచ్చినట్లు తెలిపారు. అధిక వరకట్నం కోసం కర్రతో కొడుతూ శారీరకంగాను, మానసికంగాను వేధిస్తున్నట్లు భర్త రామకృష్ణ పవన్, అత్త మహాలక్ష్మి, మామ సూర్య నారాయణమూర్తి పై అహల్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

లోక క్షేమం కోరూతూ సైకిల్ యాత్ర

రంగంపేట: లోక క్షేమం కోరుతూ సత్యసాయి బాబా భక్తులు సైకిల్ యాత్ర చేపట్టారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ యాత్ర జరుగుతుంది. ఆదివారం ఉదయం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. కోటపాడు నుంచి అన్నవరం వరకు ఈ యాత్ర సాగుతుంది.



జాతీయ జెండా ఎగురవేసిన సీతానగరం తహసీల్దార్ శ్రీనివాస్



జాతీయ జెండాను ఎగురవేసిన బిక్కవోలు తహసీల్దార్ కృష్ణ



రంగంపేట పోలీసు స్టేషన్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్ఐ తోట కృష్ణసాయి



విజయవాడలో సేవారత్న అవార్డు అందుకుంటున్న వెంకటరమణ

ఘనంగా గణతంత్ర దినోత్సవం

- వాడవాడలా జాతీయ పతాకాల ఆవిష్కరణ
- ఉత్తమ సేవలకు అవార్డులు అందుకున్న ఉద్యోగులు

రాజానగరం: రిపబ్లిక్ డే వేడుకలు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలలో జాతీయ పతాకాలు రెపరెపలాడాయి. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా రిపబ్లిక్ డే విశిష్టతను తెలియజేస్తూ, సర్వసత్తాక, ప్రజాస్వామిక, లౌకిక, గణతంత్ర భారతావనికి ఎందరో మహనీయులు ప్రాణత్యాగాలు చేశారంటూ వారి సేవలను స్మరించుకున్నారు. రిటైర్డ్ ఇండియన్ నేవీ కమాండర్ ఎస్. కృష్ణకుమార్ మాట్లాడుతూ దేశాభివృద్ధి యువత చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం డిప్లమా ఇన్ కూచిపూడి విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబిస్తూ ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జీఏ ఝాన్సీ, తహసీల్దారు కార్యాలయం వద్ద జీఏఎల్ఎస్ దేవి, పోలీసుస్టేషను వద్ద సీఐ వీరయ్యగౌడ్ త్రివర్ణ పతకాలను ఎగురవేశారు.

యూనివర్సిటీ, కళాశాలలు, పాఠశాలలో ...

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో రిపబ్లిక్ డే వేడుకలు జరిగాయి. రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎస్ శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గైట్ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ టి.జయానందకుమార్, డాక్టర్ ఎంవీఎస్ బాబు, పాలిటెక్నిక్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం, ఫార్మసీ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలోను జాతీయ పతాకాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆవిష్కరించారు.

ఉత్తమ సేవ అవార్డులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పోలీస్‌శాఖ, రెవెన్యూశాఖలో జిల్లా ఉత్తమ అవార్డులు పలువురు అందుకున్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవ సందర్భంగా రాజమహేంద్రవరం పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ చేతుల మీదుగా జిల్లాలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా సీతానగరం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కొడవటి వినోద్‌కుమార్ ఉత్తమ సేవ అవార్డును అందుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ కొల్లాటి మురళీకృష్ణ జిల్లా ఉత్తమ సేవా అవార్డును కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సీతానగరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తన కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ తహసీల్దార్లు సునీత, మూర్తి, ఆర్ఐ రవీంద్ర, వీఆర్వోలు, వీఆర్ఏలు, పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి చిట్టిబాబు జెండా ఎగురవేశారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ పాల్గొన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, షటిల్, వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో గణతంత్ర వేడుకలు హెచ్‌ఎం వీరభద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంఈవో కె.స్వామినాయక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అందరికీ ఆకట్టుకున్న భారత మాతకు వందనం రూపకంలో ఒక దృశ్యం

విమానాశ్రయంలో..

మధురపూడి: మధురపూడి విమానాశ్రయంలో డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు టెర్మినల్ భవనానికి ఎదురుగా 30 అడుగుల ఎత్తున ఏర్పాటు చేసిన పెద్దజెండాను ఎగురవేశారు. ఎయిర్‌పోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. కోరుకొండ తహసీల్దార్, సీఐ, కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయం, ఎక్సైజ్ సీఐ కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండాను ఎంపీపీ ఉల్లి వీరవెంకటసత్య సూర్యకుమారి ఆవిష్కరించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఈఓపీఆర్డీ మహేశ్వర ప్రతాప్, ఎంఈఓ కుశలవ దొర పాల్గొన్నారు.



నన్నయ వర్సిటీలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ శ్రీనివాసరావు

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వి.శ్రీనివాస్ జాతీయ పతాకం ఎగురవేశారు. ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైస్ ఎంపీపీ పెంకె మంగయ్యమ్మ పాల్గొన్నారు. బిక్కవోలు పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. బిక్కవోలు మండల పంచాయతీరాజ్ డీఈఈ కె.అచ్చుతరామారెడ్డి, బిక్కవోలు వీఆర్వో మహ్మద్ రాజా, బిక్కవోలుపోలీసు స్టేషన్ పిసి కె.తిరుమల యాదవ్, జిల్లా నీటి యజమాన సంస్థ బిక్కవోలు మండ టెక్నికల్ అసిస్టెంట్ పి.వెంకటలక్ష్మి, నేచరల్ పార్మింగ్ సిఆర్‌సీ కె. గణేష్, పందలపాక ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసరావు కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

అనపర్తి మండలంలో..

పెదపూడి: అనపర్తి మండలం రామవరంలో సచివాలయం వద్ద, అనపర్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు

పెదపూడి మండలంలో..

పెదపూడి మండల పరిషత్, తహసీల్దార్, వెలుగు, ఇతర మండలస్థాయి, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో వేడుకలు జరిగాయి. ఎంపీపీ కేతా తులసి, ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, తహసీల్దార్ పీ.వీ.సీతాపతిరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, వెలుగు ఏపీఎం వి.అరుణ కుమారి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. జి.మామిడాడలో జెడ్పీ బాలికల పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జుత్తుక సూర్యకుమారి ,ఉపాధ్యాయుడు ఎస్వీరెడ్డి పాల్గొన్నారు.

రంగంపేటలో..

రంగంపేట: మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ వీర సాయిబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ కోసు అనసూయ, పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ తోట కృష్ణసాయి జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి పాఠశాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల యాజమాన్య కమిటీ కో-ఆప్షన్ సభ్యుడు యు.వెంకట్రావు, ఎం. మల్లిబాబు గ్రీన్ కార్పెట్‌ను సమకూర్చగా, పదవ తరగతి 2003-04 బ్యాచ్ మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గెద్దాడ దుర్గారావు, గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరన్న పాల్గొన్నారు. వడిశలేరు గ్రామానికి చెందిన ఇండియన్ యాక్షన్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్ కుందేటి వెంకట రమణను ఆ సంస్థ సేవారత్న అవార్డుతో గౌరవించింది. ఆదివారం విజయవాడలో జరిగిన గణతంత్ర వేడుకలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు, జాతీయ చైర్మన్ లాల్‌సాహెబ్, కార్యదర్శి ఎంకోజిల ఆధ్వర్యంలో జరిగిన సేవారత్న అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డు అందుకున్నారు.



కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్‌ల చేతుల మీదుగా అవార్డును అందుకున్న కానిస్టేబుల్ వినోద్ కుమార్, బిక్కవోలు పంచాయతీరాజ్ డీఈఈ అచ్చుతరామారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ

మహిళను గాయపరిచిన వ్యక్తిపై కేసు

బిక్కవోలు: స్థానిక సీతమ్మపేటకు చెందిన జెమ్ము పార్వతిని గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పార్వతి కోటపాడు గ్రామంలో బీర్ ఫ్యాక్టరీలో పనిచేస్తోందన్నారు. ఆమె ఇంటి సమీపంలో ఉన్న మంత్రి అప్పలనాయుడు గతంలో వేధించడంతో అతనిపై 2024లో కేసు నమోదు చేశారు. అయితే ఈనెల 24వ తేదీన ఆమెపై కత్తితో దాడి చేశాడు. ఆమెను అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు.అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామానికి చెందిన పెదగాడ శ్యామల అదృశ్యమైనట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తొస్సిపూడి గ్రామంలోని పెదగాడ గౌరి ఈ నెల 25 తేదీన కూలీ పనికి వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటి వచ్చే సరికి తన కూతురు కనిపించడం లేదని ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధం అయిన పెంకుటిల్లు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో మేడ సత్యనారాయణకు చెందిన పెంకుటిల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించింది. అమెరికాలో ఉంటున్న తన కుమారుడి వద్దకు భార్యతో కలిసి మేడ సత్యనారాయణ రెండు నెలల క్రితం వెళ్లారు. ఇంటిలో ఎవరూ ఉండటం లేదు. అయితే ఆదివారం తెల్లవారుజామున విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో స్థానికులు పరుగులు తీశారు. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పివేసింది. ఇంటిలో ఉన్న ఫ్రిజ్, ఫ్యాన్లు, టీవీ, వాషింగ్‌మెషీన్, మంచాలు, దుస్తులు, ఫర్నీచర్, వంట సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వీఆర్వో అఖిల్, విద్యుత్‌శాఖ సిబ్బంది వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రూ.20 లక్షల ఆస్తినష్టం ఉంటుందని అంచనా.

డిక్షనరీల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలు అందించారు. ఆదివారం పాఠశాల వద్ద దాతల సహకారంతో విద్యార్థులకు అందించారు. పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాస్‌రెడ్డి, సాధానాల రాంబాబు, కానాటి అప్పలస్వామి పాల్గొన్నారు.

మహా అన్న సమారాధన

మండలంలో బిక్కవోలు గ్రామంలోని జువ్వలదొడ్డి కొలువైన ఉన్న శ్రీ సత్తెమ్మ తల్లీ అమ్మవారి జాతర పురస్కరించి ఆదివారం మహా అన్న సమారాధన నిర్వహించారు.

కమ్మేస్తున్న పొగమంచు



అర్ధరాత్రి సమయంలో రాజానగరం - అనపర్తి రోడ్డులో కమ్మేసిన పొగమంచు

రాజానగరం: ప్రస్తుత సీజన్‌లో చలి .. పులిలా గాండ్రిస్తుంది. చీకటి పడితే చాలు పొగమంచు తెరలు కమ్మేస్తుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చాలామందిలో ఈ వాతావరణ మార్పులు అనారోగ్యాలకు కారణమవుతున్నాయని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా చల్లదనం పడని వారు ఈ వాతావరణ మార్పులతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి పైనే కాకుండా గ్రామీణ రోడ్ల పై కూడా ప్రయాణించేవారికి ముందు ఏముందో కనిపించనంతగా పొగమంచు దట్టంగా పట్టి, ఇబ్బంది పెడుతోంది. వాహనాలకు లైట్లు ఉన్నా పొగ మంచు పూర్తిగా కమ్మేస్తున్న నేపథ్యంలో వాటి ఫోకస్ కూడా పనిచేయడం లేదు. దీనితో రాత్రి ప్రయాణాలు చేయడానికి కూడా జనం భయపడిపోతున్నారు.